# ప్రపంచ ఆకలి సూచీలో దిగజారుతున్న భారతదేశం

**ప్రపంచ** ఆకలి సూచీలో భారతదేశం ప్రతి సంవత్సరం దిగజారుతోందనే వార్తలు చూసినప్పుడు గత ఆరు దశాబ్దాల కాలంగా మన దేశ వ్యవసాయ రంగంలో ప్రభుత్వాలు చేసిన సంస్కరణలు, ప్రయోగాలు ప్రజల ప్రయోజనాల కనుగుణంగా సాగుతున్నాయా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

దాదాపు రెండు శతాబ్దాల కాలం సాగిన బ్రిటిష్ వలస పాలకుల దోపిడీ విధానాలు, ఆనాటికి తమ దేశాల్లో పెరుగుతున్న పారిశ్రామిక అవసరాలకు కావలసిన ముడి సరుకును ఉత్పత్తి చేసే విధంగా మనదేశ వ్యవసాయ రంగాన్ని మలిచాయి. తమ అవసరాల కోసం రైతులపై నిర్బంధం సాగించి, దమనకాండ ప్రయోగించి పత్తి, నీలిమందు వంటి పంటలను ఉత్పత్తి చేయించుకున్నారు. ఆహార ధాన్యాల కొరత, కరువు కాటకాలతో నిత్యం దుర్భిక్షం వెంటాడుతూ కరువు వాతబడి పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయినా, వారికేమీ పట్టలేదు. ఆహార పంటలను ప్రోత్సహించకపోవడంతో పాటు పండిన ఆహార ధాన్యాలలో అధిక భాగాన్ని బ్రిటిష్ వారు, స్థానిక జమీందారులు నిర్బంధంగా లెవీ విధించి, వారి సిబ్బంది, సైనిక అవసరాలకు వినియోగించి, ప్రజలను పస్తులకు, ఆకలి చావులకు గురిచేశారు.

మన దేశం, చైనా – రెండు సంవత్సరాల తేడాతో, చైనా – 1949లో విముక్తి కాగా, 1947లో మన దేశానికి 'స్వాతంత్రం' ప్రకటించబడింది. మన దేశం కంటే అనుకూల వాతావరణ పరిస్థితులు, తక్కువ మోతాదులో సాగుభూమి కలిగి ఉండి మన దేశ జనాభా కంటే ఆనాటికే అధిక జనాభా ఉన్న చైనా, విప్లవాత్మక భూసంస్కరణలు చేపట్టిందని, ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచడంతో పాటు అందరికీ ఆహారాన్ని అందుబాటులోకి తెచ్చిందనే విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. అయితే, మన దేశ వ్యవసాయ రంగపు ఈనాటి దుస్థితికి, క్షీణతకు కారణాలను రేఖామాత్రంగానైనా పరిశీలిద్దాం.

మనదేశంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ఆహార ధాన్యాల అవసరం ఉందనే కారణాన్ని అడ్డుపెట్టుకొని, అధికారమార్పిడి తదనంతరం కూడా మన దేశంపై ఆధిపత్యం చలాయిస్తున్న అమెరికా, బ్రిటన్ తదితర సామ్రాజ్యవాద దేశాలు తమ ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలతో మనదేశ వ్యవసాయ రంగంలో జోక్యం చేసుకుంటూనే ఉన్నాయి.

1951లోనే అమెరికా, భారతదేశంలో అత్యవసరంగా ఆహారకొరతను నివారించేందుకు అంటూ 20 లక్షల టన్నుల గోధుమలను తన నుండే కొనుగోలు చేయడానికి 142.28 కోట్ల రుణం ఇచ్చింది. ఆ విధంగా తన మిగులు ఉత్పత్తిని లాభకరంగా వదిలించుకోవడంతో పాటు, ఈ రుణ చెల్లింపులో భాగంగా తనకు అవసరమైన కీలకమైన వ్యూహాత్మక రీత్యా ప్రాధాన్యత గల పదార్థాలను తక్షణం, నిరంతరం సరఫరా చేయాలనే షరతులతో ఈ సహాయం ప్రారంభమైందని కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి పేర్కొన్నారు.

తనకు మిగులుగా ఉన్న వ్యవసాయ సరుకులను ముఖ్యంగా గోధుమలను మన దేశం వంటి వెనుకబడిన దేశాలకు సరఫరా చేసేందుకు అమెరికా 1954లో పబ్లిక్ లా (పిఎల్)–480 అనే విధానాన్ని రూపొందించింది. దానితో అమెరికా తన మిగులు గోధుమలన్నీ భారతదేశానికి సరఫరా చేసింది. గోధుమలు అమ్మగా వచ్చిన డబ్బునంతా భారత రాజకీయఆర్థిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు మంచి సాధనంగా అమెరికా సామ్రాజ్యవాదం వినియోగించుకుంది.

వివిధ వాతావరణ, నైసర్గిక పరిస్థితుల్లో మనదేశంలో 1,20,000 రకాల పైగా వరి పండేవి. రైతుల జీవితానుభవంలో నుండే వీటిని అభివృద్ధి చేశారు. 1950లలో ఒరిస్సా కేంద్రంగా కేంద్రీయ వరి పరిశోధన కేంద్రాన్ని (సిఆర్ఆర్ఐ) ఏర్పరిచినా, చీడ, పీడలను తట్టుకుంటూ, ఆహార ఉత్పత్తిని పెంచే వరి వంగడాలను అభివృద్ధి చేసే కృషిని పాలకులు నిరుత్సాహపరుస్తూ వచ్చారు.

కాగా, వరి వినియోగమే లేని దేశమైన అమెరికా, 1960లో రాక్ ఫెల్లర్, ఫోర్డ్ ఫౌండేషన్ల పెట్టుబడులతో అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం (ఐఆర్ఐ)ని ఫిలిప్పీన్స్‌లో ఏర్పరిచింది. భారతదేశపు వ్యవసాయ రంగ కీలకమైన, వ్యూహాత్మక విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానమంతా తెలిసిన డాక్టర్ స్వామినాథన్‌ను ఈ కేంద్రానికి డైరెక్టర్ జనరల్‌గా నియమింప చేసుకుంది.

ఐఆర్ఆర్ఐ 1966లో అధిక ఎరువులతో, అధిక దిగుబడులని ఇచ్చే ఐఆర్–8 అనే రకపు వరి వంగడాన్ని అభివృద్ధి చేసింది. సస్య విప్లవం పేరుతో 1967లో తొలుత ఈ వంగడాలను, వాటికి ఎరువులను, పురుగుమందులను విస్తృతంగా రైతాంగం వినియోగించేందుకు అనుగుణంగా మనదేశ పాలకులను ఒప్పించారు. ఈ రకమైన వరి సాగుతో తెగుళ్లు విస్తారంగా వ్యాపిస్తాయనీ, క్రిమి కీటకాల దాడులను తట్టుకోలేక పోతాయనీ రిచారియా వంటి భారత వ్యవసాయ శాస్త్రవేత్తల అభ్యంతరాలను పాలకులు తోసిపుచ్చారు. బలవంతంగా, అవమానకరంగా ఆయనను కేంద్రీయ వరి పరిశోధనా కేంద్ర డైరెక్టర్‌గా పదవీ విరమణ చేయించారు.

సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత తిరిగి రిచారియాను మధ్యప్రదేశ్ ప్రభుత్వం, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా

తీసుకుంది. ఐ.ఆర్.ఆర్.ఐ రూపొందించిన వరి వంగడాలకు భిన్నంగా, రిచారియా నేతృత్వంలో బలమైన, పొట్టి వరి వంగడాలను రూపొందించి ప్రయోగాత్మకంగా మధ్యప్రదేశ్‌లో విజయం కూడా సాధించారు. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అడ్డుపడుతున్న రిచా రియాను లోబరుచుకునే ప్రయత్నాలు సాగించారు. అవి విఫలమవడంతో భారత పాలకుల ద్వారా రిచారియా నాయకత్వంలోని మధ్యప్రదేశ్ రైస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌నే మూసి వేయించారు.

ఫలితంగా హరిత విప్లవంతో అధిక దిగుబడి విత్తనాలు విస్తృతంగా వ్యవసాయ రంగంలో ప్రవేశించాయి. దీనిని వెన్నంటే వ్యవసాయ రంగంలో ఉత్పాదకాలపై రైతాంగం చేసే వ్యయం కూడా భారీగా పెరిగింది. సంస్థాగత రుణ సదుపాయం లేకపోవడంతో అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడటం పెరిగి, రుణభారం రైతాంగానికి మరింత విషమంగా పరిణమించింది. మరీ ముఖ్యంగా కౌలు రైతులు, కౌలు కూడా చెల్లించాల్సి రావడంతో, మరింత అధిక ఒత్తిడికి, రుణభారాలకు లోనయ్యారు. రుణభారాలను తట్టుకోలేని రైతుల ఆత్మహత్యలు, ప్రత్యేకించి కౌలు రైతుల ఆత్మహత్యలు లక్షలాదిగా కొనసాగుతూ అవి రోజువారీ వార్తలుగా మారిపోయాయి.

దీనికి మరో పార్శ్వాన్ని పరిశీలిస్తే రైతులకు విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు మొదలుకొని వ్యవసాయ ఉపకరణాల తయారీదారులైన సామ్రాజ్యవాద, బహుళజాతి కార్పొరేట్ పరిశ్రమలు అసాధారణ లాభాలను గడిస్తూ వస్తున్నాయి.

1990 నుండి వరుసగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలన్నీ అనుసరిస్తూ వస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు రైతాంగ పరిస్థితిని మరింత దుర్భరం చేశాయి. నూతన వ్యవసాయ విధానం,మరో సస్య విప్లవం పేరుతో దేశ పాలకులు మరో అడుగు ముందుకు వేసి జన్యు మార్పిడి విత్తనాలను ప్రవేశపెట్టారు. ఇవి జీవావరణం, పర్యావరణాలకు మరింత హానికరంగా పరిణమించడమే కాకుండా మన దేశంపై సామ్రాజ్యవాద జీవ–సాంకేతిక, వ్యవసాయ–వాణిజ్య, వ్యవసాయ –ఆహార కంపెనీల గుత్తాధిపత్యాన్ని పెంచడానికి దోహదపడ్డాయి. ఆర్థిక మీటలతో వ్యవసాయం నుండి, సాగుభూముల నుండి రైతాంగాన్ని బలవంతంగా పరాయీకరించే చర్యలు వేగవంతం అయ్యాయి. దొడ్డి దోవన అమలయ్యే ఈ విధానాలకు నిర్దిష్ట చట్ట రూపం ఇచ్చి, సామ్రాజ్యవాద బహుళజాతి,కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలను పరిరక్షించేందుకు వీలుగా ముందుకు వచ్చినవే, ఇటీవల మోడీ ప్రభుత్వం ప్రకటించిన మూడు వ్యవసాయ చట్టాలు అనేది అర్థం చేసుకోవాలి.

మరోవైపున తప్పుడు లెక్కలతో ప్రజలను మాయ చేస్తున్నారు. దేశ జనాభా అవసరాలకు మించి ఆహార ధాన్యాలను పండించి ఎగుమతి కూడా చేయగలుగుతున్నామని చెబుతున్నారు. అయితే దేశ జనాభాకు సరిపడిన మోతాదులో ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగినప్పటికీ, వారందరికీ ఆహారం అందడం లేదనే అంశాన్ని మరుగుపరుస్తున్నారు.

ఇటీవలే ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ప్రపంచ ఆహార కార్యక్రమం విడుదల చేసిన ప్రపంచ ఆకలి సూచీని గమనిస్తే 125 దేశాల ఈ జాబితాలో మనం గత సంవత్సరం కంటే నాలుగు స్థానాలు దిగజారి 111వ స్థానంలో ఉన్నామని తెలుస్తోంది. మరి ఈ హరిత విప్లవాలు, మరో సస్య విప్లవాలు ఎవరిని ఉద్ధరిస్తున్నాయి?! ఆహార లభ్యతే ఇలా ఉంటే ఇక పౌష్టికాహారం గురించి వేరే చెప్పుకోవలసిన అవసరమేముంది?!

★ ★ ★ ★ ★